క్లుప్తంగా

ఘనంగా క్రీస్తు రాజు పండగ



మహిళలకు చీరలు అందిస్తున్న గనిశెట్టి కనకరాజు

పెందుర్తి: మండలంలోని చింతగట్లలో క్రీస్తు రాజు పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 40 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అప్పారావు, వార్డు మెంబర్లు రమణ, నాగరాజు, ఈశ్వరరావు, మంగ, ఏఎంసీ డైరెక్టర్ బి.రమణ, జి.ఆనంద్, ఎస్.సత్యనారాయణ, గొర్లి వెంకట్రావు, అక్కునాయుడు, జి.కె రాజు, కేశవరావు, గణేష్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న విశ్వనాథనాయుడు, శ్రీనుబాబు

పెందుర్తి: సుజాతనగర్‌లోని సత్యసాయి మందిరంలో సీతారాముల కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం అలంకరణ చేశారు. అర్చకులు శేషు, మారుతీ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిగింది. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. మాజీ జెడ్పీటీసీ కంచిపాటి విశ్వనాథనాయుడు, సింహచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, సత్యసాయి భక్త బృందం ప్రతినిధులు ముక్క గోపి, జ్యోతి, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు, పెద్దలు

పరవాడ: తానాం గ్రామంలో పాజిటివ్ పీపుల్స్ యూత్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థాం శనివారం రాత్రి నిర్వహించిన శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. టీటీడీ పురోహితులతో నిర్వహించిన కల్యాణంలో తానాం పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. భక్తుల సందర్శనార్థం శ్రీనివాసుడిని గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భాగంగా 168వ ఇంటింటా గోవిందుడు అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ, ఎంపీటీసీ రొంగలి సునీత పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల విజేతలతో ఉపాధ్యాయులు

పెందుర్తి: సరిపల్లిలోని భాష్యం పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మెగా క్విజ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 20 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు భాష్యం జోనల్ ఇన్‌చార్జి కె.వెంకట్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జోనల్ సీఈవో సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

పెందుర్తి: మూడు రాష్ట్రాలు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో బీజేపీ గెలుపొందడంతో ఆ పార్టీ నాయకులు ఆదివారం పెందుర్తిలో సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో మిఠాయిలు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు నాగేశ్వరరావు, జయరాజు, అప్పారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు పెందుర్తిలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.

పల్లెల్లో జలసిరి

మండలంలో రూ.13.99 కోట్లతో పైపులైను పనులు
8 గ్రామాల్లో పనుల పూర్తి



నా పేరు ఒమ్మి కోటి. మాది మండలంలోని అంతకాపల్లి శివారు ఒమ్మువానిపాలెం గ్రామం. గ్రామంలో తాగునీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారం. మంచినీటి కోసం చేతి బోర్లు, గ్రామ శివారుల్లోని బావులకు పరుగులు పెట్టేవారం. ప్రభుత్వం ఇంటింటికీ తాగు నీటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య తీరింది. మహిళలకు నీటి కష్టాలు తప్పాయి. కుళాయిలు ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో పాటు అధికారులకు మా గ్రామం తరఫున కృతజ్ఞతలు తెలియస్తున్నాం. ఇలా ఒక గ్రామమే కాదు .. తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించినందుకు ప్రభుత్వానికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.





ఇది కదా అభివృద్ధి



వంగలిలో పైపులను పరిశీలిస్తున్న ఏఈ హిమబిందు

పూర్తయిన పనుల వివరాలు

గ్రామం	నిధులు
రావర్తివానిపాలెం	రూ.13.46 లక్షలు
ఒమ్మువానిపాలెం	రూ.11.30 లక్షలు
బొడవానిపాలెం	రూ.14.75 లక్షలు
సాలాపువానిపాలెం	రూ.14.06 లక్షలు
అమృతపురం	రూ.30.25 లక్షలు
అసకపల్లి	రూ.28.30 లక్షలు
ఎరుకులనాయుడుపాలెం	రూ.16.93 లక్షలు
పెదనాయుడుపాలెం	రూ.27.90 లక్షలు

ఫేజ్-2లో ఓవర్ హెడ్ ట్యాంకులు, ఇంటింటి కుళాయి పనులు చేపడుతున్న గ్రామాలు ఇవే

గ్రామం	నిధులు
సూరెడ్డిపాలెం	రూ.27.55 లక్షలు
రావలమ్మపాలెం	రూ.43.39 లక్షలు
ఆరిపాక	రూ.26.83 లక్షలు
ఏళ్లుప్పి	రూ.16.84 లక్షలు
గొల్లలపాలెం	రూ.27.05 లక్షలు
గాలిభీమవరం	రూ.18.41 లక్షలు
గొటివాడ	రూ.28.04 లక్షలు
గుల్లేపల్లి	రూ.41.65 లక్షలు
మల్లునాయుడుపాలెం	రూ.28.19 లక్షలు
పైడివాడ	రూ.15.35 లక్షలు
తవ్వవానిపాలెం	రూ. 28.50 లక్షలు



రావలమ్మపాలెంలో ఇంటింటి కుళాయి వద్ద నీరు పడుతున్న మహిళ



సబ్బవరంలో చురుగ్గా సాగుతున్న పైపులైన్ విస్తరణ పనులు

సబ్బవరం: మండలంలోని ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా మండలంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా సమారు రూ.13.99 కోట్లతో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించేందుకు పనులు చేపట్టింది. ఇప్పటికే 8 గ్రామాల్లో పనులు పూర్తి చేసి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు.

తుది దశకు చేరిన పైపులైన్ విస్తరణ పనులు

మండలంలో నూతనంగా పైపులైన్ విస్తరణ పనులు తుదిదశకు చేరాయి. సబ్బవరం రూ.137.72 లక్షలతో చేపట్టిన పనులు పూర్తి కావచ్చాయి. అంతకాపల్లిలో రూ.29.28 లక్షలతో, వంగలిలో రూ.33.61 లక్షలతో చేపట్టన పనుల్లో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు ఆయా ఇప్పటికే పూర్తయ్యాయి. పైపులైన్ పనులు చురుగ్గా సాగతున్నాయి. మొగలిపురంలో రూ.67.15 లక్షలతో చేపట్టి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

టెండర్ పూర్తయిన పనుల వివరాలు

- పలుగ్రామాల్లో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సబ్బవరం అగ్రహారంలో రూ.33.70 లక్షలు, దొంగలమర్రీసీ తారామపురం గ్రామానికి రూ.6.50 లక్షలు, విప్పాక అగ్రహారానికి రూ.14.70 లక్షలు,దుడ్డువాకలో రూ.6.20 లక్షలతో పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి.

కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానంలో 51 పనులు

- కమ్యూనిటీ కాంట్రాక్టు విధానంలో మండలంలో 5.81 కోట్లతో 51 వర్కులు చేపట్టనున్నారు. వీటిని రెండు పార్టులుగా విభజించారు. పార్టు–ఎ లో 3.89 కోట్లతో,పార్టు–బిలో రూ.1.92 కోట్లతో పనులు చేపట్టనున్నారు.వీటిలో చింతగట్ల అగ్రహారం,అంతకాపల్లి,లగిశెట్టిపాలెం,బాటజంగా పాలెం,గుల్లేపల్లి,ఇరువాడ, మల్లునాయుడుపాలెం, చిన మల్లునాయుడుపాలెం,నల్లరేగులపాలెం,అమ్ములపాలెం,నారపాడు,బలిజపాలెం, రాయపుర అగ్రహారం,తవ్వవానిపాలెం,టిక్కలిపాలెం,ఒమ్మువానిపాలెం గ్రామాల్లో ఇప్పటికే నిధులు మంజూరు కావడంతో టెండర్ ప్రక్రియ ప్రారంభమయ్యింది.
- పార్టు–బిలో నామినేషన్ విధానంలో సూరెడ్డిపాలెం,పైడివాడ గొటివాడ,గాలిభీమవరం, గొల్లలపాలెం,ఎల్లుప్పి,అసకపల్లి గ్రామాల్లో పనులు చేపడుతున్నారు.

ఇంటింటికీ రక్షిత మంచినీరు



తాగునీటి సమస్యను పరిష్కరించి ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది.దీనిలో భాగంగా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 8 గ్రామాల్లో పనులు పూర్తి చేసి ఇంటింటి కుళాయిల ద్వారా నీరు అందిస్తున్నాం. మిగిలిన గ్రామాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొద్ది నెలల్లో మిగిలిన పనులు పూర్తి చేసి ఇంటింటికీ తాగు నీటి కుళాయిలు అందుబాటులోకి తెస్తాం.

–హిమబిందు,
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ,సబ్బవరం మండలం.

నీటి బాధలు తప్పాయి



గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉండేది. ఊరు చివర ఉండే చేతి బోరు నుంచి నీరు పట్టుకుని తెచ్చుకునేవారం. ఆ చేతి బోరు పని చేయకపోతే బావి లో నీరు తోడి తెచ్చుకునే పరిస్థితి ఉండేది. ప్రభుత్వం ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసిన తర్వాత నీటి కోసం బాధలు తప్పాయి. ఇంటి వినియోగానికి అవసరమైన నీటిని ఇంట్లోనే పట్టుకుని ఉపయోగించుకోంటున్నాం.

–జెట్టి కొండమ్మ,
వంగలి,సబ్బవరం మండలం.

ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ముస్లింల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో ఎంతో కృషి చేసిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి నల్లక్వారీ వద్ద నిర్మించనున్న మసీదుకు ఆదివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ మసీదు నిర్మాణానికి తనవంతుగా రూ.2 లక్షల నిధులు అందిస్తామని చెప్పారు. ముస్లిం సంఘం పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. షేక్ ఇస్మాయిల్, షేక్‌ఖాన్ సాహెబ్, షేక్ కోళ్లపీరు, షేక్ కరీముల్లా, షేక్‌రహమాన్, షేక్ అబ్దుల్లా, షేక్ బృహన్, నాయకులు గొర్లె రామునాయుడు, నరవ బంగారునాయుడు, మూలినాయుడు, మసీదు పెద్దలు ఎస్‌కే సాహుల్, షేక్‌షఫీ ఉల్లా, షేక్ గంగాధర్, మదీనా, ఆదాం, మహ్మద్ సుభాని, ఇస్మాయిల్, రెహమాన్ పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

స్వామీజీ గోపాల కృష్ణమాచార్యులు



సమావేశంలో ప్రసంగిస్తున్న కృష్ణమాచార్యులు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పరవాడ: ప్రపంచానికి శాంతినిచ్చే ఒకే ఒక ధర్మం సనాతన హిందూ ధర్మం అని స్వామీజీ శ్రీనివాసల గోపాల కృష్ణమాచార్యులు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఆదివారం హిందూ సంస్కృత సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వామిజీ శ్రీనివాసుల గోపాల కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని రక్షించడానికి పనిచేయాలని సూచించారు. పాశ్చాత్య దేశాల్లో స్త్రీల కోసం వెంపర్లాడితే భారత దేశంలో స్త్రీ పూజ్యనీయ స్థానంలో ఉండేదన్నారు. అన్యమత ప్రచారాలకు అడ్డు కట్ట వేయాలని పిలుపునిచ్చారు. మతం మారితే తల్లిని మార్చుకున్నట్టేనన్నారు. అలాగే దేవాలయాల కేంద్రంగా వారం వారం భజన, ప్రతీ పౌర్ణానికి సాముహిక హారతి, ఏకాదశి నగర సంకీర్తన చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శోభాయాత్ర, భజన గురువులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జోన్ ధర్మ ప్రచారక్ ఆదారి గంగాధర్, జిల్లా సంయోజకులు ఎం.నరేంద్ర చౌదరి, మండల మహిళా కన్వీనర్ పి.కృష్ణవేణి, మండల కన్వీనర్ డి.సంజీవరావు, పి.శ్రీను, రాజశేఖర్, భజనగురువులు, కోలాట బృందాలు పాల్గొన్నాయి.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ



నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికులందరూ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1025వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులతో పాటు స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ కార్మికులు పాల్గొని, కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పిఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

అ'పూర్వ' సందడి

ఎంవీపీ కాలనీ: ఇంజినీరింగ్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కాకినాడ (జేఎన్‌టీయూ) పూర్వవిద్యార్థుల సమావేశం ఆదివారం ఎంవీపీ కాలనీలోని ఐఐఎంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 1982 బ్యాంచ్‌కు చెందిన విద్యార్థులు భారీగా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఏఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ 1982 నుంచి ఏటా డిసెంబర్ తొలి ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 42వ ఏడాది నిర్విరామంగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. స్నేహితులతో ఆనందంగా గడిపారు. అనంతరం జేఎన్‌టీయూ కాకినాడ వీసీ జీవీఎస్ ప్రసాదరాజును సత్కరించారు.

చల్లగ చూడు.. పసలతల్లీ..

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం ,గొర్లివానిపాలెం గ్రామాల్లో పసలతల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పసుపు కుంకుమలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. పశువుల పండగలో భాగంగా పిండి వంటలు సమర్పించారు. పసుపు కుంకుమలతో తయారు చేసిన వసంతకమును పాడి పశువులతో పాటు పాకలు, పంటలపై జల్లడం శుభసూచకంగా భావిస్తారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వంగలి గ్రామస్తులు

సబ్బవరం:మండలంలోని వంగలి గ్రామంలో బొద్రాలమ్మ ఆలయ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఆలయ మండపం నిర్మాణానికి అవసరమయ్యే మొత్తాన్ని తన సొంత నిధులు కేటాయిస్తానని గతంలో గ్రామంలో పర్యటించినపుడు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు సాయం అందిస్తుండడంతో గ్రామస్తులు ఆదివారం రాంపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యర్ర అప్పలనాయుడు,యర్ర సతీష్,యర్ర హనుమంతు,యర్ర బాలకృష్ణ,యర్ర సోమలింగేశ్వరనాయుడు, యర్ర యేసు తదితరులు ఉన్నారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్)కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో నగర ప్రజలు అర్జీలు పెట్టుకోవచ్చు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.

ఘనంగా 'వాసీవా' స్వర్ణోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలు, పలు విభాగాల ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీసీ రోడ్డులోని కాకతీయ ఐటీఐ వ్యాలీలో నిర్వహించిన వనసమారాధనలో వాసీవా ప్రతినిధులు, సీనియర్ పారిశ్రామిక వేత్తల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పారిశ్రామిక వేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్ఎం జయబాబు, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, ఎస్ఎస్ఐసీ అధికారులు కమలేశ్వరి, అశ్విన్, ఐలా కమిషనర్ జయచంద్ర, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి పర్సూరి ప్రభాకర్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, భక్తులు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తరశ శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యావాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించాయ. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

'ఒంటి కాలు పరుగు' పుస్తకావిష్కరణ



సాహితీ సభలో మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

మహారాణిపేట : తెలుగు భాష, సాహిత్యాలను పరిపుష్టం చేస్తూ రచనలు చేసిన ఘనత డాక్టర్ బండి సత్యనారాయణ సొంతమని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. ఆదివారం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన ఒంటి కాలు పరుగు కవిత్వ సంపుటిని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యనారాయణ గొప్ప రచనలు చేశారన్నారు. సామాజిక స్పృహతో మానవీయ కోణంలో ఆయన రచనలు ఉంటాయన్నారు. స్త్రీవాదాన్ని సమర్థిస్తూ కవితలు రాశారని అన్నారు. ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.సుబ్బారావు మాట్లాడుతూ కొత్తగా కవితలు రాసే వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి కార్యక్రమాల విభాగాధిపతి బేతా రామ సూర్య ప్రకాశరావు, ప్రముఖ కవి, రచయిత గరిమెళ్ల నాగేశ్వరరావు, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, డి.వి.సూర్యారావు, మేనేజర్ పి.ఎ.రాజు, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.